## యూరియా వినియోగాన్ని తగ్గించాలి


పూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు రైతులు

**మేడ్చల్ రూరల్, మే 31:** మేడ్చల్ మున్సిపల్ పరిధి పూడూరు గ్రామం, గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి సుతారిగూడ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు పంట సాగుపై శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. యూరియా వినియోగం తగ్గించడంతో భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వి.వర ప్రసాద్, వసంత, వి. సౌమ్య, పరుశురాం, వ్యవసాయ అధికారి అర్చన, విస్తరణ అధికారులు తేజస్విని, సుమిత, ఏఎంసీ డైరెక్టర్ రాజు, రైతులు పాల్గొన్నారు.

## హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి



నాగిశెట్టిపల్లిలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి

**శామీర్‌పేట, మే 31:** హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని మూడుచింతలపల్లి తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నాగిశెట్టిపల్లి శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం భూభారతి చట్టం అమలులో భాగంగా ఈనెల 3నుంచి మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, అనుష, మాజీ సర్పంచ్ కృపాకర్‌రెడ్డి, ఏవో రవికుమార్ పాల్గొన్నారు.

## జడ్జికి సన్మానం



**చర్లపల్లి, మే 31:** కుషాయిగూడలోని జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఒకటో అదనపు సెషన్ జడ్జి, అదనపు ఫ్యామిలీ కోర్టు జడ్జి ఆర్. రఘునాథ్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమంలో ఆయనను సన్మానించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, న్యాయమూర్తులు సూరి కృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, బార్‌అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాపిరెడ్డి, సంయుక్త కార్యదర్శి ధనలక్ష్మి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెక్కులతో పాటు తులం బంగారం ఇవ్వాలి

**కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యేలక్ష్మారెడ్డి**


ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి,షాదీ చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.


ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

**రామంతాపూర్,మే 31:** కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ పారదర్శకంగా జరగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఉప్పల్ మండలానికి చెందిన 122 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో చెప్పిన విధంగా కల్యాణలక్ష్మి పథకం కింద లక్ష నూట పదహారు రూపాయలతో తులం బంగారం ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలో షాదీ ముబారక్,కల్యాణ లక్ష్మి చెక్కులను దరఖాస్తు చేసుకొని అర్హులైన వారికి అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్,బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### సురేష్ అకాల మరణం బాధాకరం

పాత్రికేయుడు,ఉప్పల్ ప్రెస్ క్లబ్ సభ్యుడు మాదిరాజు సురేష్ అకాల మరణం బాధాకరం అని ఎమ్మె ల్యే లక్ష్మారెడ్డి అన్నారు.శనివారం ఆయన అంత్యక్రియలకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్ తో ఎమ్మెల్యే పంపించిన ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాను అని వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.పలు పార్టీల నాయకులు సురేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉప్పల్ జర్నలిస్టు సంఘం నా యకులు వెంకట్రామ్‌రెడ్డి, ఎం.రాంప్రసాద్ శర్మ,శ్రీనివాస్.శ్రీహరి, శ్రీశైలం,తిరుపతి రెడ్డి,శేఖర్,అశోక్,కిశోర్ ,శివాజీ, యాదగిరి సురేష్‌కు నివాళులర్పించారు.

**మల్లాపూర్:** పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడ మల్లారెడ్డి గార్డెన్‌లో బీఆర్ఎస్ నాయకుడు బైరి నవీన్ గౌడ్ పర్యవేక్షణలో బీఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కిమ్స్ ఫౌండేషన్,వారి సహకారంతో బీఎల్ఆర్ ట్రస్ట్, చాముండేశ్వరి గురు దత్త ట్రస్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ వైద్య బృం దంచే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో డివిజన్ పరిధిలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు.అదేవిధంగా ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**చర్లపల్లి:** డివిజన్ పరిధిలోని ఈసీనగర్ రైల్వే టెర్మినల్ సమీపంలో ఏర్పాటు చేసిన పీఆర్‌ఓ 9జీమ్‌ను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శనివాం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మహేశ్‌గౌడ్, విజయ్‌సింహారెడ్డి, శ్రావణ్‌కుమార్, కపిల్,లోకేశ్ పాల్గొన్నారు.

# 3 నుంచి రెవెన్యూ సదస్సులు

- గ్రామాల్లో ప్రజలకు ముందుగా సమాచారం అందించాలి
- అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచన


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ కలెక్టరేట్, మే 31:** ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులకు గ్రామాల్లో ముందుగా ప్రజలకు సమాచారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లాలో ఈనెల 3నుంచి జరుగునున్న గ్రామ రెవెన్యూ సదస్సులపై శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలను కేటగిరిల వారీగా అంశాలను పరిశీలించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. అర్జీల్లో సర్వే నంబర్లను, భూ విస్తీర్ణం, ఏ విధంగా సంక్రమించింది అనే భూ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అర్జీలను ముందుగా ధరణిలో ఉన్నదా లేదా అనే అంశాన్ని ముందుగా పరిశీలించి, అర్జీలకు అవసరమైన రశీదులను దరఖాస్తుదారులకు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అవసరమైన మేరకు నోటీసులు జారీ చేసి, క్షేత్రస్థాయి పరిశీలించాలని తెలిపారు. ప్రతిరోజు సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై నివేదిక తప్పనిసరిగా అందించాలని, ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను కూడా గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సుల వివరాలు

**ఘట్ కేసర్, మే 31:** భూ భారతిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ఈనెల 3 నుంచి 13 వరకు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో జరుగనున్న రెవెన్యూ సదస్సులను భూ బాధితులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు డీఎస్ రజిని తెలిపారు. ఘట్‌కేసర్ ఎమ్మార్వో కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ ఈనెల 3న ఘట్‌కేసర్, ఎదులాబాద్, 4న కొర్రెముల, కొండాపూర్, 5న ప్రతాపసింగారం, పడమటిసాయిగూడెం, 6న అవుషాపూర్, కాచవానిసింగారం, 9న అంకుశాపూర్, ముత్వెల్లిగూడ, 10న మాదారం, ఇస్మాయిల్ ఖాన్ గూడ, 11న మర్రిపల్లిగూడ, అన్నోజిగూడ 12న యంనంపేట్‌లో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు.







## కంఠమహేశ్వర స్వామికి ఎమ్మెల్యే పూజలు


ఆలయంలో స్థానికులతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి.

**పోచారం,మే31:** పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని కంఠమహేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మూడో వార్షికోత్సవాల్లో భాగంగా మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని బీఆర్ఎస్ నాకులు, గౌడ కులస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శంకర్ గౌడ్, మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్యా నాయక్,మాజీ కౌన్సిలర్లు వెంకటేశ్ గౌడ్, సాయిరెడ్డి,మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కొర్రెముల మాజీ సర్పంచ్ వెంకటేశ్ గౌడ్,నాయకులు బి.సత్తిరెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి,గౌడ సంఘం ప్రతినిధులు వెంకటస్వామి గౌడ్, దర్శన్ గౌడ్,శంకర్ గౌడ్, భాస్కర్ గౌడ్,విజయ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.అంతకు ముందు ఎమ్మెల్యే మల్లారెడ్డి చౌదరిగూడలో చిన్న పిల్లల ప్రైవేటు పాఠశాలను ప్రారంభించారు.

## పొగాకు ఉత్పత్తులను వాడొద్దు


జిల్లా కోర్టులో సిబ్బంది, న్యాయవాదులచే పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి డి.కిరణ్‌కుమార్

**చర్లపల్లి, మే 31 :** మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా శనివాం కుషాయిగూడలోని జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సినీయర్ జడ్జి డి.కిరణ్‌కుమార్ కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, పారా లీగల్ వాలింటర్స్‌తో పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ధుమపానం, పొగాకు ఉత్పత్తులను తీసుకొవద్దని సూచించారు. అదేవిధంగా కోర్టు సిబ్బంది, పారాలీగల్ వలంటర్స్ కోర్టుకు వచ్చే కక్షిదారులకు పొగాకుపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కోర్టు ఆవరణలో పొగాకు తీసుకున్న, ధుమపానం చేసిన చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటర్స్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## '100 రోజుల కార్యాచరణ ప్రణాళిక'పై అవగాహన

**బోడుప్పల్, మే 31:** ఈనెల2 నుంచి సెప్టెంబర్ 10 వరకు తెలంగాణ ప్రభుత్వం, కమిషనర్,డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళికపై బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ శైలజ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్ కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన ఈ సదస్సుకు వివిధ శాఖల అధికారులు, కాలనీ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. తాగునీటి సమస్య, పారిశుధ్య నిర్వహణ, ఆస్తి పన్ను , డ్రైనేజీ సమస్యలు, వనమహోత్సవం, వీధి దీపాల ఏర్పాటు, దోమల నివారణ ఇతరత్న సమస్యలపై కాలనీ సంఘాల నుంచి లిఖితపూర్వక ఫిర్యాదులు తీసుకొని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో 100 రోజుల ప్రణాళికను విజయవంతం చేస్తామని కమిషనర్ శైలజ పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్యాంసుందర్రావు, డీఈ చిరంజీవులు, ఏఈ రాకేష్, ఆర్ఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, సంగీత, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, లక్ష్మి, మెప్మా భార్గవి, వార్డ్ ఆఫీసర్లు, వార్డు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# తూంకుంటలో హైడ్రా కూల్చివేతలు

**కబ్జా చెర వీడిన 2200 గజాల పార్కు స్థలం**


తూంకుంట మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను జేసీబీతో తొలగింపజేస్తున్న హైడ్రా బృందం

**శామీర్‌పేట, మే 31:** తూంకుంట మున్సిపల్ పరిధిలో ఆక్రమణకు గురైన పార్కు స్థలం, 30 ఫీట్ల రోడ్డుతో పాటు నాలుగు ప్లాట్లను కబ్జా చెర నుంచి విడిపించారు. హైడ్రా అధికారుల దాడులతో కాలనీవాసులు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని నార్త్ పార్క్ వెంచర్‌లో కొందరు వ్యక్తులు దాదాపు 2200గజాల పార్కు స్థలంలో పాటు ప్రజలకు చెందిన 4 ప్లాట్లు, 30 ఫీట్ల రోడ్డును కబ్జా చేశారు. ఏకంగా ప్రహరీతో పాటు గదుల నిర్మాణం చేశారు. దీంతో నార్త్ పార్క్ అవెన్యూ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కబ్జా తంతుపై స్థానికి మున్సిపల్ కమిషనర్, హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన హైడ్రా ఇన్‌స్పెక్టర్ నరేశ్, టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో బృందం పోలీసులతో కలిసి శనివారం కబ్జాకు గురైన ప్రాంతంతో దాడులు నిర్వహించి నేల మట్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులు, స్థలాలకు ఎలాంటి భంగం కలిగించినా కఠిన చర్యలు ఉంటాయని ప్రజలు కబ్జాలు, ఆక్రమణలపై ఫిర్యాదు చేయవచ్చునన్నారు. దీంతో అసోసియేషన్ సభ్యులు కబ్జాను తొలగించడంతో హర్షం వ్యక్తం చేశారు.

### పెద్ద చెరువును పరిశీలిస్తున్న హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌టీం

**పీర్జాదిగూడ:** పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని గూడెం చెరువును శనివారం హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌టీమ్ పరిశీలించారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని చెరువులు,నాలాలు పరిస్థితి వాటి సామర్థ్యం, వర్షం నీటి ప్రవాహం వంటివి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు ముందుగానే రావడం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలోల భాగంగా పీర్జాదిగూడ,బోడుప్పల్,ఘట్‌కేసర్ ప్రాంతాలకు స్పెషల్ హైడ్రా డిజస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీమ్ నంబర్ 33ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా ప్రాంతాల చెరువులు, నాలాలను పరిశీలించి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, హైడ్రా అత్యవసర సేవలకు 9000113667 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హైడ్రా డిజిస్టర్ ఫోర్సు టీం సభ్యులు పాల్గొన్నారు.

## 2న ప్రజావాణి రద్దు

**మేడ్చల్ కలెక్టరేట్, మే 31:** ఈనెల 2న కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు ఉంటామని అందుకోసంప్రజావాణిని రద్దు చేసినట్లు, జిల్లా ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం



**మేడ్చల్ కలెక్టరేట్, మే 31:** రాంపల్లి దాయర వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి కీసర దాయర గ్రామానికి చెందిన చింతల సతీష్ రూ. 26 వేల విరాళాన్ని అందించారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావడం చాల సంతోషంగా ఉందని రాంపల్లి దాయర మాజీ ఉపసర్పంచ్ రాము అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు


ఏసీపీ వెంకట్‌రెడ్డిని కలిసి సన్మానించిన టూబీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీ చైతన్యనగర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

**చర్లపల్లి, మే 31 :** కుషాయిగూడ డివిజన్ పరిధిలో నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏసీపీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేట హెచ్‌బీకాలనీ డివిజన్ చైతన్యనగర్ టూబీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీ చైతన్యనగర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ గుర్తింపు సాధించిన సందర్భంగా కాలనీవాసులు ఏసీపీ వెంకట్‌రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నరేశ్, సీతామహాలక్ష్మి, లక్ష్మి, జ్యోతి, నజీమా, రజని, పాల్‌రాజు, అంజయ్య, విద్యాధర్‌రావు, కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

## తల్లితో సహా పిల్లలు అదృశ్యం



పిల్లలు హరిణి,దవని


అదృశ్యమైన తల్లి పద్మ

**మల్కాజిగిరి :** తల్లితో పాటు పిల్లలు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సునీల్ కుమార్ కథనం ప్రకారం గౌతమ్‌నగర్‌కు చెందిన ప్రదీప్ కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఇతనికి భార్య పద్మ (28), పిల్లలు హరిణి (5), దవని(4 ఉన్నారు. ఈనెల 14న ఇంటికి తాళం వేసి ఇద్దరు పిల్లలతో బయటకు వెళ్ళింది. రాత్రికి ఇంటికి తిరిగి రాలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో భర్త ప్రదీప్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

# కిలాడి లేడీ

- మాయమాటలతో మోసాలు చేయడంలో దిట్ట
- హైకోర్ట్ న్యాయవాదినని.. న్యాయమూర్తినంటూ బిల్డప్
- హైకోర్ట్‌లో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం
- జడ్జినని సీఐని నమ్మించి వేములవాడలో ప్రత్యేక దర్శనం
- కరీంనగర్‌లో మాయలేడి అరెస్ట్

**వెంగళరావునగర్, మే 31 :** అమాయకులే ఆ మాయలేడి టార్గెట్.. ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించి కోట్ల రూపాయలు కొట్టేసింది... హైకోర్టు న్యాయవాదినని ఓసారి..న్యాయమూర్తినని మరోసారి మాయమాటలతో బోల్తా కొట్టించింది.. చివరికి కరీంనగర్‌లో ఆ కంత్రీ కిలాడీని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై శివశంకర్ కథనం ప్రకారం.. అంబర్‌పేట్‌కు చెందిన బితుకు ప్రసన్న రెడ్డి మోసాలు చేయడంలో ఆరితేరింది. వెంగళరావునగర్‌లో ఉండే ఎస్. జీవన్ ఉద్యోగాన్వేషణలో ఉండగా.. ఆమె పరిచయమైంది. హైకోర్టు న్యాయవాదినైన తనకు చాలా మంది జడ్జీలతో పరిచయాలు ఉన్నాయని.. రూ.15 లక్షలు ఇస్తే హైకోర్డులో రికార్డు పోస్ట్ ఉద్యోగం ఇప్పిస్తానని జీవన్‌ను నమ్మించింది. ఆమె మాటలు నమ్మిన అతను ముందుగా రూ.6.5 లక్షలు ఇచ్చాడు. మిగతా రూ.8.5 లక్షలు వసూలు చేసేందుకు శైలజారెడ్డి అనే మహిళను హైకోర్టు న్యాయమూర్తిగా పరిచయం చేసింది. ఆమె అసిస్టెంట్ ఫిరోజ్ ఖాన్ అని చెప్పి వారిద్దరిని పరిచయం చేసింది. ఆరు నెలలు గడిచినా ఉద్యోగం రాలేదు. ఈ నేపథ్యంలో రవి అనే వ్యక్తి ఫోన్‌చేసి తాను ప్రసన్న రెడ్డి చేతిలో మోసపోయానని.. ఉద్యోగం కోసం ఆమెకు రూ.4.5లక్షలు ఇచ్చానని చెప్పాడు. ఈ క్రమంలో ప్రసన్నరెడ్డికు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రాగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే.. తాను హైకోర్టు జడ్జినంటూ వేములవాడ పోలీ స్ ఇన్‌స్పెక్టర్‌ను మాయమాటలతో బోల్తా కొట్టించి.. దర్శనానికి పోలీసు భద్రత కల్పించాలని కోరి.. ప్రత్యేక దర్శనం చేసుకుంది.

### 100 మందినిపైగా మోసం..

సుమారు 100 మందికి పైగా నిరుద్యోగులను హైకోర్టులో ఉద్యోగాల పేరిట మోసం చేసింది. ఒక్కొక్కరి నుంచి రూ. 3 నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసింది. నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలకు చెందినవారు ఎక్కువగా మోసపోయినట్లు పోలీసులు గుర్తించారు. తన వద్ద పనిచేసే డ్రైవర్లకు కూడా హైకోర్టులో ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు వసూలు చేసింది. ఓ మహిళ భర్తతో గొడవ పడి దేవాలయానికి వస్తే..తాను అడ్వకేట్ అని నమ్మించి విడాకులు ఇప్పిస్తానని .. హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆమె నుంచి రూ.3 లక్షలు కాజేసింది. అంతే కాకుండా ఆమె ద్వారా ఆమె బంధువులు 10 మంది వద్ద ఒక్కకొక్కరి నుంచి రూ.3 లక్షలు వసూలు చేసింది. 2016లో బంజారాహిల్స్ లో ఆమెపై చీటింగ్ కేసు నమోదైంది ఇక జగిత్యాలలో రెండు కేసులు బుక్కయ్యాయి.

### కరీంనగర్‌లో చిక్కిన కిలాడి

బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కరీంనగర్‌లోని శ్రీ విల్లీస్‌లో కంత్రీ కిలాడి ప్రసన్న రెడ్డి మధురానగర్ పోలీసులకు చిక్కింది. మోసాల్లో ప్రమే యం ఉన్న ఆమె భర్త రామలింగారెడ్డి సైతం పోలీసులు పట్టుకున్నారు. కిలాడి లేడి దంపతుల్ని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు తరలించారు.

**మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

డబ్బులిస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే మోసగాళ్ల మాటలు నమ్మొద్దు.మాయ మాటలతో మోసాలు చేసే ఇలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

*ప్రభాకర్, మధురానగర్ ఇన్ స్పెక్టర్*

**హెచ్చరిక ప్రకటన**

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా, నా క్లయింట్ మేకల దుర్గా రెడ్డి తండ్రి స్వర్గీయ ఎమ్.లచ్చి రెడ్డి, నివాసం: ఇం.నెం.4-56/3, వి.వి.నగర్, స్ట్రీట్ నెం.8, హబ్సిగూడ, GHMC, హైదరాబాద్ వారు ఎదులాబాద్ గ్రామం, ఘట్కేసర్ మండలం, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వద్ద గల సర్వే నెం.55, 58, 67, 54, 81, 68, 57, 82, 41/పార్ట్స్‌లో కవర్ చేయబడిన మొత్తం ఎక.5-18 గుంటలు విస్తీర్ణపు భూములకు సంబంధించి 1) ముజకారి ప్రమీళ, 2) దాత్రిక సునీత, 3) కాలేరు కవిత, 4) కాలేరు లక్ష్మి, 5) కాలేరు రోహిత్, 6) కాలేరు సాన్విత్, అందరి నివాసం: ఎదులాబాద్ గ్రామం, ఘట్కేసర్ మండలం, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వారితో అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నారు. బ్యాంకు చెక్‌ల ద్వారా రూ.39,90,178/- మొత్తాన్ని చెల్లించారు. పై భూమితో పాటు నా క్లయింట్ ఎదులాబాద్ గ్రామం, ఘట్కేసర్ మండలం, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వద్ద గల సర్వే నెం.55, 58, 67, 54, 81, 68, 57, 82, 41/పార్ట్స్‌లో కవర్ చేయబడిన మొత్తం ఎక.12-00 గుంటలు విస్తీర్ణపు భూములకు సంబంధించి 1) కాలేరు వెంకట్ కిషన్, 2) కాలేరు ప్రభాకర్, 3) కాలేరు బాబు, 4) కాలేరు అమరేందర్, 5) కాలేరు ఇస్తాజి రావు, 6) కె.సాయి బాబా, 7) కె.ద్వారక్ బాబు వారితో కూడా అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం మొత్తం అమ్మకం ప్రతిఫలంలో భాగంగా బాయానాగా 05.01.2022న బ్యాంకు చెక్‌ల ద్వారా రూ.92,14,284/- మొత్తాన్ని చెల్లించారు. ఆ సమయంలో వారి అంతర్గత వివాదాలు పరిష్కరించబడిన తర్వాత నా క్లయింట్‌కు సేల్ డీడ్ ఎగ్జిక్యూట్ చేయుటకు వాగ్దానం చేశారు. కాని నా క్లయింటును మోసం చేస్తూ వారు మూడవ పార్టీలతో ఇతర అగ్రిమెంట్లను కుదుర్చుకున్నారు మరియు ఎక్కువ ధరకు సదరు ప్లాట్లు/ భూములను విక్రయించుటకు ప్రయత్నిస్తున్నారు. అందువల్ల నా క్లయింట్ ఎల్.బి.నగర్ వద్ద గౌరవనీయ I అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్-కమ్-V అడిషనల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్, ఉప్పల్ గారి సమక్షంలో 3 (5) BNSతో చదువబడు 34 IPC (316 (2), 318(4)తో చదువబడు సెక్షన్ 420, 406 క్రింద, క్రిమినల్ కేస్ CCSR నెం.785/2025 మరియు CCSR నెం.786/2025 దాఖలు చేశారు, అందువల్ల పైన తెలిపిన వ్యక్తులు లేదా వారి అగ్రిమెంట్‌హోల్డర్స్ నుండి ఏవేని ప్లాట్/ప్లాట్లను కొనుగోలు చేయరాదని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. ఈ హెచ్చరిక ప్రకటనను కాదని ఎవరేని వ్యక్తి/వ్యక్తులు అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నచో వారి స్వంత నష్టపూచీకత్తుపై అలాచేసినవారవుతారు మరియు చట్ట ప్రకారం ప్రాసిక్యూషన్‌కు బాధ్యత వహించవలసి వస్తుంది.

సం/- ఎమ్.భీష్మాచారి
అడ్వకేట్
కార్యాలయం: డి.నెం.3-2-1/2, 1వ అంతస్తు, నింబోలిఅడ్డ, కాచిగూడ, హైదరాబాద్, సెల్ నెం.9441223721